## ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



అదృశ్యమైన తల్లి మమత, ఇద్దరు పిల్లలు

శంషాబాద్ రూరల్, జూన్ 23: ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన ఆదివారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని పెద్దతూప్రకు చెందిన దిద్యాల యాదయ్య ఈనెల 19న పొలానికి వెళ్లి వచ్చేసరికి భార్య మమత(27) కుమారుడు భాను (10), కుతూరు వైష్ణవి(7) ఇంట్లో కనిపించలేదు. దీంతో బంధువు వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### బాలుడు అదృశ్యం..

శంషాబాద్ రూరల్, జూన్ 23: కరాటే క్లాస్‌కు వెళ్లిన బాలుడు అదృశ్యమైన సంఘటన ఆదివారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు వివరాల ప్రకారం శంషాబాద్ పట్టణంలోని నక్షత్ర విల్లాస్‌లో ఉంటున్న జీఎస్‌ఈ మేనేజర్ డాక్టర్ రాజేశ్ కుమారుడు ప్రతీక్ (13) ఎయిర్‌పోర్టులోని చిన్మయ విద్యాలయంలో చదువుతున్నాడు. శనివారం పాఠశాలలో ఇతరులతో గొడవపడిన్నట్లు టీచర్ తన తండ్రికి చెప్పింది. దీంతో తండ్రి బాలుడిని మందలించాడు. సాయంత్రం కరాటే క్లాస్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రతీక్

# జహంగీర్‌పీర్ దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 23: దైవచింతనతో మానవుడికి ప్రశాంతత లభిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కొత్తూరు జహంగీర్‌పీర్ దర్గాలో ఆదివారం ఎమ్మెల్యే ప్రార్థనలు నిర్వహించి న్యాజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గాలో ప్రార్థనల అనంతరం చాదర్‌ను సమర్పించారు. అనంతరం మైలార్‌దేవ్‌పల్లి అమ్మగార్డెన్‌లో నాజ్ విందును ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని దర్గాలో ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నిర్వహించిన నాజ్‌లో పాల్గొని సన్మానిస్తున్న సతీశ్, జడ్పీటీసీ తన్వి తదితరులు



జహంగీర్‌పీర్ దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

### నాజ్‌కు హాజరైన నాయకులు

శంషాబాద్ రూరల్, జూన్ 23: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఆదివారం కాటేదాన్‌లోని అమ్మగార్డెన్‌లో నాజ్ నిర్వహించారు. వేడుకలకు శంషాబాద్ జడ్పీటీసీ తన్వి, మల్కారం సహకార సంఘం చైర్మన్ సతీశ్, మండల పార్టీ అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, నీరటి రాజుముదిరాజ్, మాజీ సర్పంచ్ దండు ఇస్తారితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు భగవంతుడు ఆశీర్వాదం ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రార్థించారు.

## యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి

### పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్



సోమాజిగూడలోని జయగార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మోహన్‌కుమార్

ఖైరతాబాద్, జూన్ 23: హాస్టల్ యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ సూచించారు. ఆదివారం సాయంత్రం సోమాజిగూడలోని జయగార్డెన్స్‌లో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాస్టల్ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్స్‌లో వసతి పొందే వారి భద్రత కోసం తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఒకనెల డాటా బ్యాకప్ ఉంచాలని సూచించారు. 24 గంటల పాటు సెక్యూరిటీ సిబ్బందిని అందుబాటులో ఉంచి హాస్టల్స్‌లో సరిపడా పార్కింగ్ స్థలం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఫైర్ ఎస్టింగ్ గ్యాషర్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హాస్టళ్లకు వచ్చే వారి వివరాలను స్వీకరించేందుకు రిజిస్టర్లను ఏర్పాటు చేసుకోవాలని నిబంధనలు పాటించని హాస్టల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంజాగుట్ట, మధురానగర్ పీఎస్ సీఐలు శోభన్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, డీఐ క్రాంతి కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

# ధర్నాను విజయవంతం చేయాలి

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ పిలుపు




హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ యూసుఫ్

హిమాయత్‌నగర్, జూన్ 23: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. నగరంలో జూలై 3న డీఎంఈ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై కార్మికులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. జీవో నం.60 ప్రకారం రూ.13,600 చెల్లించాల్సి ఉండగా రూ.11వేలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. పీఎఫ్ సక్రమంగా చెల్లించకపోవడంతో పాటు సెలవులు ఇవ్వకుండా కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎం.లక్ష్మిబాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనాబేగం, నాయకులు పి.సురేశ్, దేవేందర్, సుధాకర్, కిష్టమ్మ, ఇమ్రాన్, వెంకటరాజ్యం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ కమిటీ సభ్యులకు సత్కారం



నారాయణగూడలో కమిటీ సభ్యులను సత్కరిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

హిమాయత్‌నగర్, జూన్ 23: ఇటీవల నూతనంగా రాజ్ మోహల్లా సంక్షేమ సంఘం ఎన్నికైన సందర్భంగా ఆదివారం రాత్రి నారాయణగూడలో కమిటీ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నేత, ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పూలబొకే అందించి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డి.రాజేందర్‌కుమార్, రఘువేందర్, కృష్ణయాదవ్, నవీన్, కమల్, బస్తీ కమిటీ అధ్యక్షుడు డి.వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జేమ్స్, నాయకులు శేషగిరిరావు, మాణిక్యమ్మ, మంజుల, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గంగాదేవి కట్ట మైసమ్మకు పూజలు



ఖైరతాబాద్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గంగాదేవి కట్ట మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించారు. - ఖైరతాబాద్

## దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం

హిమాయత్‌నగర్, జూన్ 23: దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఆడిటోరియంలో ఆదివారం స్వదేశీ స్వావలంభి భారత్ అభియాన్ రాష్ట్ర సభ జరిగింది. వారు మాట్లాడుతూ చిన్న తరహా, సూక్ష్మ తరహా పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి పెంపొందించేందుకు యువత ముందుకు రావాలన్నారు. జపాన్, చైనాల కంటే ఉపాధి కల్పనా రంగంలో భారత్ ముందుందని చెప్పారు. స్వదేశీ భాష, వస్తు వాడకంతోనే దేశం మరింత ప్రగతి సాధిస్తుందని పేర్కొన్నారు. సమాజంలో సహకారం, వికేంద్రీకరణ అవసరమని, స్వావలంబి భారత్ అభియాన్ ప్రతి గ్రామానికి చేరేలా సంస్థ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అఖిల భారత స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ ఆర్.సుందరం, రాష్ట్ర కన్వీనర్ బొల్లంపల్లి ఇంద్రసేనారెడ్డి, ప్రతినిధులు కేశవ్ సోని, శ్రీనాథ్, చింతకింది మల్లేశం, భరత్ కుమార్, జగదీశ్, లింగమూర్తి, సుధాకర్, హరీశ్ బాబు, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.




కేశవ మెమోరియల్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

## కూకట్‌పల్లిలో పోలీసుల తనిఖీలు



కైత్లాపూర్ గ్రాండ్‌లో పర్యవేక్షిస్తున్న డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ

మూసాపేట, జూన్23: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నేరపూరిత ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేయాలని సూచించారు. కైత్లాపూర్ గ్రాండ్, కేపీహెచ్‌బీకాలనీ మెట్రోస్టేషన్, భగ్యనగర్‌కాలనీ ప్రాంతాల్లో పోలీసులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ కృష్ణమోహన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ముస్లిం మైనార్టీలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి



రాహుల్ గాంధీకి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న షానవాజ్

హిమాయత్‌నగర్, జూన్ 23: మైనార్టీ కోటాలో ముస్లింలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని గ్రీన్‌స్టార్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత ఎండీ షానావాజ్ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఢిల్లీలో రాహుల్ గాంధీకి పూలబొకేను అందించి ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

### గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ ఒలింపిక్ దినోత్సవం

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి స్టేడియంలోని హాకీ క్రీడా ప్రాంగణంలో జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాకీ తెలంగాణ అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ హాజరై ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల్లో పారిస్‌లో నిర్వహించే ఒలింపిక్ క్రీడల్లో హాకీతో పాటు ఇతర క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు రాణించాలన్నారు. కార్యక్రమంలో హాకీ తెలంగాణ సెక్రటరీ భీంసింగ్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల హాకీ సెక్రటరీ వేణుభాస్కర్‌రెడ్డి, కోచ్‌లు సోనీ, జ్యోతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా వార్షికోత్సవం

బండ్లగూడ, జూన్ 23: రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రధాన రహదారిపై వెలిసిన వీరభద్ర స్వామి ఆలయ రెండో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకంతో పూజలతో ప్రారంభించారు. స్థానిక భక్తులు వార్షికోత్సవ మహాపూజలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ పెద్దలు దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



బుద్వేల్ వీరభద్ర స్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి సత్కారం



హిమాయత్‌నగర్‌లో బండి సంజయ్‌కి అభినందనలు తెలిపిన సిద్ధు

హిమాయత్‌నగర్, జూన్ 23: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా నగరానికి వచ్చిన సందర్భంగా ఆదివారం హిమాయత్‌నగర్‌లో ప్రముఖ సామాజికవేత్తలు సిద్ధు, రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్ మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### ఊటుపల్లిలో వ్యక్తి అదృశ్యం



కోలా రంజిత్

శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఊటుపల్లికి చెందిన కోలా రంజిత్(27) ప్రైవేటు ఉద్యోగి. గత నెల 30న రంజిత్ భార్య ప్రియాంక నగరంలోని నానాక్‌రాంగూడలో అమెజాన్ కంపెనీలో పని చేయడానికి వెళ్లింది. తిరిగి 31న ఇంటికి వచ్చేసరికి భర్త ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అలరించిన నృత్య ప్రదర్శనలు

కొండాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాకారులు కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఆదివారం కువైట్‌లో పుట్టి, పెరిగినప్పటికీ సంప్రదాయ నృత్యమైన కూచిపూడిని ప్రముఖ గురువులు వేదవల్లి వద్ద శిక్షణ పొందిన అనన్య సూరపనేని తన కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆద్యంతం ఆకట్టుకున్న ది. సరస్వతి వందన, కళాసాపురము కాదా, కృష్ణ లీలలు, ధనశ్రీ తిల్లాన అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నది. అనంతరం శంకరానంద కళాక్షేత్రం గురువులు పద్మశ్రీ ఆనంద శంకర్ శిష్య బృందం పుష్పాంజలి, దేవి కీర్తనం, దశావతారం, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు.

# పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం



మార్కండేయనగర్‌లోని సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం నూతన కార్యవర్గం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 23: పొదుపుతోనే ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధి సాధ్యమని సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దె యాదగిరి, అధ్యక్షుడు పగిడిమర్రి సూర్యనారాయణ అన్నారు. పొదుపు సంఘం నిర్వహణలో పాలకవర్గ సభ్యులు సమిష్టిగా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయనగర్‌లోని సంఘం 24వ వార్షిక సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుటుంబ, ఆర్థిక అవసరాలకు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేయకుండా నూతనంగా అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పులు కోరే సభ్యుల ఆర్థిక అవసరాలను గుర్తించి సంఘం నిబంధనల ప్రకారం అప్పుల మంజూరులో ఇతోధికంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మించాలని మహాసభ తీర్మానించింది. ప్రజలు ముందు చూపుతో ఆలోచించి పొదుపు సంఘాల్లో సభ్యులుగా కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక..

సత్యసాయి పొదుపు సంఘం వార్షిక సభ అనంతరం పదవీకాలం ముగిసిన సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడి మునగపాటి విష్ణు, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్‌కుమార్, సహాయ కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, కోశాధికారి కోట పవన్‌కుమార్, పాలకవర్గ సభ్యులు విడెం రమేశ్, శంకర్, నరేందర్, నరేశ్, విజయ్‌కుమార్, భానుచందర్, ధనుంజయ్ తదితరులను ఎన్నుకున్నారు.

# ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వవిద్యార్థులు




విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పెద్దతూప్ర పూర్వ విద్యార్థులు

శంషాబాద్ రూరల్, జూన్ 23: శంషాబాద్ మండలంలోని పెద్దతూప్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006 పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశానికి తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి నాటి జ్ఞాపకాలను నేమరువేసుకొని రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపిన్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

### వెంగళ రావునగర్‌కాలనీలో..

వెంగళరావునగర్: ముప్పై ఏండ్ల క్రితం వారంతా కలిసి నలంద పాఠశాలలో చదివారు. ప్రయోజకులై వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. ఈ సమావేశానికి వెంగళరావునగర్‌కాలనీ నలంద పాఠశాల పూర్వ విద్యార్థి, సైబరాబాద్ ఎస్బీ విభాగం డీసీపీ సాయిశ్రీ కీలకపాత్ర పోషించారు. 1994 నలంద పాఠశాలలో చదువుకున్న వారంతా గోల్కొండ రిస్టార్ట్‌లో గ్రాండ్ రీయూనియన్‌లో పూర్వ విద్యార్థులు, విద్యనేర్పిన గురువులు కలిశారు. జీవితకాలం పాటు ఈ స్నేహబంధాన్ని కొనసాగించుకుంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నలంద పాఠశాల చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్ మంతెన సూర్య పాల్గొన్నారు.



పాఠశాల పూర్వ విద్యార్థులతో పాఠశాల చైర్మన్, తదితరులు